## మినీ కథ

# జ్ఞానోదయం




శ్రీవారిని ఆఫీసుకు, పిల్లలను స్కూలుకు పంపించి అమ్మ ఎందుకో కబురు పెట్టింది అనుకుంటూ ఆ ఊళ్ళోనే వున్న అమ్మ వాళ్ళింటివైపు నడవసాగింది లక్ష్మి.

"అమ్మా" అన్నాడు రిక్షావాలా.

"వద్దులే దగ్గరే" అంటూ నడవసాగింది. 'ఏమిటో ఈ హైదరాబాదులో నాలుగు అడుగులకైనా రూపాయ ఇవ్వాలి. ఎదుగు బొదుగు లేని జీవితాలు" అనుకుంది.

ఇద్దరన్నయ్యల తరువాత లక్ష్మి అన్నయ్యలు ఉద్యోగ రీత్యా ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళారు. లక్ష్మిని మాత్రం ఆ ఊళ్ళోనే వున్న ఓ ఎల్. డి. సి. కి ఇచ్చి ఉన్నంతలోనే పెళ్ళి జరిపారు. కొడుకులు దూరంలో వున్న కూతురైనా దగ్గరలో వున్నందుకు కొండంత ధైర్యం ఆ ముసిలి దంపతులకు.

లక్ష్మి తండ్రి బడిపంతులు. ఎదుగు బొదుగులేని జీతంరాళ్ళతో అందరిని చిన్న చిన్న ఉద్యోగాలలో చేర్చాడు. తన వారసత్వంలాగే వారు కూడా బడిపంతుళ్ళే. ఈ ఆలోచనలతోటే ఇల్లు చేరింది.

"రా అమ్మా రా" అంటూ ఆప్యాయంగా పిలిచింది తల్లి పార్వతమ్మ. కుశల ప్రశ్నలయిన తరువాత "భోజనం చేద్దువు గాని రా అమ్మా" అంది.

"నేను చేసేవచ్చానమ్మా" అని-"నాన్నా మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అంది చిక్కిపోయిన తండ్రి శరీరాన్ని చూస్తూ లక్ష్మి.

"చూస్తూ వున్నావు కదమ్మా-ఈ మధ్యలో దగ్గు, ఆయాసం మరీ ఎక్కువయింది. ఏం చేస్తామమ్మా" అన్నాడు తండ్రి. తల్లినీ తండ్రినీ చూసేసరికి జాలివేసింది లక్ష్మికి. వృద్ధాప్యపు ఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ వయస్సులో ఎందుకో ఈ బాధలు. కొడుకుల దగ్గరుండి, పసివారిని చూసుకుంటూ, రామా కృష్ణా అనుకుంటూ వుండక అని పైకి అనేసింది.

"నీకు తెలియందేముందమ్మా. ఇద్దరి దగ్గర నుంచి ఉత్తరాలు రాక రెండు నెలలు కావస్తోంది. ఇక మా వుండటం గురించి అంటావా. చెరొక చోట వుండాలట. లేదా ఒక ఆరు నెలలు ఒకరి దగ్గర.మిగతా ఆరు నెలలు ఇంకొకరికి దగ్గర వుండాలట. వారన్నదాంట్లో కూడా తప్పేముందమ్మా!"

"ఏమోతల్లీ! పెన్షన్ డబ్బులు రానే వస్తున్నాయి. ఇద్దరికీ వండే ఓపిక వుంది. మీరు ప్రక్కనే వున్నారు. నేను కోరుకునే దొక్కటే నమ్మా నా కాళ్ళు చేతులు స్వాధీనంలో వుండగనే నన్ను మీ నాన్నగారి కళ్ళెదుటే తీసుకెళితే చాలమ్మా."

"ఏమోనమ్మా కన్నవారికి ఈ బాధలు తప్పవు" అంది పార్వతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగగా. "సరేగాని అమ్మాయ్ మన పక్కింటి రామయ్య పంతులుగారు పెద్దిపేట వెళుతున్నారట. చిన్నన్నయ్యకు కొత్త పచ్చడిచేసి పంపిద్దామని టొమాటోలు కోసి ఎండబెట్టాను.నేను కలిపితే కారంఅంటారు. కాస్త నీవు కలిపితే బావుంటుందని కబురెట్టాను. అలాగే, బాబుకు మైసూరుపాకు అంటే ఇష్టంకదా! కాస్త చేసి పెట్టమ్మా. ఏదో నాలుగురోజులు తింటారు." అన్నారు పార్వతమ్మగారు అమాయకంగా.

"అబ్బ ఏమోనమ్మా నీకేమో అన్నీ ఆరాటాలు. పిల్లలు పిల్లలు అంటూ కొట్టుకుపోతావు. మీ గురించి ఆలోచించని వాళ్ళ గురించి నీ కెందుకమ్మా ఇంత తాపత్రయం. వాళ్ళు చేసుకుంటారులే" అంది ఆవేశంగా.

"ఏమోనమ్మా! మమ్మల్ని తలవనీ తలవకపోనీ ఏ తల్లీ తండ్రియైనా కోరుకునేది ఒకటేనమ్మా. బిడ్డలు ఎక్కడున్నా క్షేమంగా వుండాలని. ఆస్తులు పంచిపెట్టకున్నా వారి దగ్గరుండి చేతనైనదిచేసి నా ప్రేమనే పంచి యివ్వాలనుకున్నాను." దీర్ఘంగా నిట్టూర్చింది పార్వతమ్మగారు.

"చూడమ్మా! చెప్పడం మరిచేపోయాను. నిన్న శివం దగ్గర కెళ్ళామమ్మా బాబాగారు వచ్చారని తెలిస్తే. అబ్బ ఏం జనం. ఆ గొంతులో ఏముందోకాని ఎంతసేపయినా వినాలనిపిస్తుంది. బాబాగారు చెప్పారు,అత్తామామలకు, తల్లితండ్రులకు మీ ప్రేమను ఎంత యివ్వగలరో మీ వృద్ధాప్యంలో మీరు కూడా అంతే పొందగలరు అని చెప్పారు. నిజమేననిపించింది" అంది బాధగా.

టొమాటో పచ్చడి కలిపి, మైసూరుపాక్ చేసి ఇంటిదారి పట్టింది ఆలోచిస్తూ. తల్లి ప్రేమ చూస్తే హృదయం ద్రవించింది లక్ష్మికి.

ఇంటితాళం తీసింది. గుమ్మంలోనే కన్పించింది మామగారు వ్రాసిన కార్డు. చదువసాగింది."చిరంజీవి రవికి.

మీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది. దేవుడి దయవల్ల మీ అందరు క్షేమమని భావిస్తాను. మేము ఇక్కడ క్షేమమే. మీ దగ్గరి నుంచి ఉత్తరమురాక చాలా రోజులు కావచ్చెను. నా ఆరోగ్యం అంతగా బాగో లేదు. బి.పి. ఎక్కువగా వుంది. మీ అమ్మ కూడా చాలా నీరసంగా వుంది. వృద్ధాప్యం రాలా మరి? అమ్మాయిల దగ్గరి నుండి ఉత్తరాలు వస్తున్నాయి.

కోడలు లక్ష్మికి.

క్షేమమే కదమ్మా. మీ అత్తగారు వ్రాయమన్నారు, పచ్చళ్ళు, వడియాలు పెడుతున్నానని. అమ్మా లక్ష్మి యిప్పుడు ఇంకా బరువు బాధ్యతలు ఏమీ లేవు. చిన్నమ్మాయి పెళ్ళి చేశాం. ఇక మన పొలం గుత్తకు ఇచ్చేశాం. బాధ్యతలు తీరిపోయాయి. ఆ భగవంతుని పిలుపుకొరకె ఎదురు చూస్తున్నాం. ఇక మిమ్మల్ని కోరేది ఒక్కటేనమ్మా. అబ్బాయికి పనులతో వీలుకాకపోయినా వారానికోసారి మీ క్షేమం తెల్పుతూ కార్డు వ్రాయమ్మా. మాకు ఇంక కావలసింది ఏమీ లేదమ్మా. ఇక పిల్లలందరికి నా ముద్దులు తెల్పేది. పాపకు చెప్పమ్మా కాళ్ళకు వెండి పట్టాలు చేయించామని. వచ్చేటప్పుడు తేగలను. ఇక వుంటాను. ఉత్తరం వ్రాయడం మరిచిపోవద్దు.

ఇట్లు
మీ నాన్న
వరంధామయ్య.

కార్డు చదువుతుంటే లక్ష్మి కళ్ళ నుంచి నీళ్ళుజలజల రాలిపోయాయి. 'ఛీ! నేను ఎంత స్వార్థపరురాలను! ఏ తల్లితండ్రుల మనసైనా ఒకటేనని ఎందుకాలోచించలేదు? ఇందాక అమ్మ గురించి ఎంత బాధపడ్డాను' లక్ష్మి మనసుకు జ్ఞానోదయం కలిగింది.... 'వారు ఆఫీసు నుంచి రాగానే చెప్పాలి. ఈ వయసులో వారిని బాధపెట్టకూడదు. తీసుకు రమ్మని చెప్పాలి' అనుకుంది తేలికయిన మనసుతో.

—జి. అరుణ